# నిజాయితీ!



రచన : శ్రీ పి. వి. కృష్ణ

'తప్పుకోండి ... తప్పుకోండి! అయ్యగారి కారొత్తంది తప్పుకోండి!' అంటూ పరుగెత్తి గేటు తెరచి పట్టుకొని వినయంగా కార్లో కూర్చొన్న అయ్యగారికి శాల్యూట్ కొట్టి నిలబడ్డాడు ప్యూను.

ఆయన బంగారు రంగు కారు లోపల ఓ ప్రక్కగా ఆగింది. అందులోనుండి వెంటనే డ్రైవరు దిగి పరుగెత్తుకుంటూ బ్యాక్‌డోర్ దగ్గరకి వెళ్ళి తెరచి పట్టుకొన్నాడు. ఆయన కారు దిగగానే ఎండపడి ఆయన వంటిమీది ఖరీదయిన సూటు తళుక్కున మెరుస్తూండగా, గొఱ్ఱెల మందల్లా గుంపులు గుంపులుగా నిలబడ్డ నిరుద్యోగులను కూలింగ్ గ్లాసెస్‌లోంచి నిర్లక్ష్యంగా చూస్తూ, నాలుగో అంతస్థుకు చేర్చే లిఫ్టులోకి ఎక్కి పైకి వెళ్ళాడు.

'ఊఁ! నెంబర్ల ప్రకారం పదిమంది పైకి వెళ్ళండయ్యా' అన్నాడు ప్యూను పది రోజులనుండి పంపుతున్నా తరగని నిరుద్యోగులను చూస్తూ.

అతనా మాట అనటమే ఆలస్యం కొత్త సినిమా రిలీజయిన రోజు బుకింగు కౌంటరు వైపు పడుతూ, లేస్తూ పరిగెత్తే సినీ అభిమానుల్లా లిఫ్టువైపు పరుగెత్తేరు ఓ పదిమంది.

వాళ్ళకేసి ఎగతాళిగా చూస్తూ 'ఓయ్! ఆటెక్కడి కయ్యా బాబూ! మెట్లుఎక్కిపోండి' పెద్దగా కేకేశాడు ప్యూను.

డిగ్రీమెరిట్ సర్టిఫికేట్స్ మోస్తూన్నవారికి ఐదోతరగతి క్యూడా ప్యాసుకాని అతని మాటలకు సిగ్గుపడ్డారు. అందరి ముందూ తమని అలా అవమానపరచినందుకు కోపం వచ్చింది కాని. వారి నిస్సహాయత దాన్ని అణచివేసింది. నెమ్మదిగా మెట్లవైపు వెళ్ళారు.

లోపలికెళ్ళినవారు నిరాశతో బయటకు రాసాగేరు. రెండుసార్లు స్పెషల్ కాఫీలు, ఓసారి లంచ్ క్యారియరు లోపలి కెళ్ళిన తరువాత మురళి వంతు వచ్చింది.

ఉదయంనుండి నిలబడి, నిలబడీ కాళ్ళు పీక్కుపోతున్నా, ఎండలో నిలబడటంవల్ల వళ్ళంతా చెమటతో తడిసి ముద్దయినా, ఆకలి కడుపు మాడిపోతున్నా లెక్కచేయక ఆ మెట్లన్నీ ఎక్కి లోపలికెళ్ళాడు మురళి.

పగలంతా ఇంటర్వ్యూలు చేసి చేసి అలసిపోయిన ఆఫీసరుగారు ఎయిర్‌కండిషన్డు గదిలో పట్టిన చెమటను ఖరీదయిన కర్చీఫ్‌తో సుతారంగా అద్దుకొంటున్నారు.

'నమస్కారమండి!'

'కూర్చో!'

'పొరపాటున నీరసంవలన అలా అనిపించేదేమో' అనుకొని కూర్చోలేదు.

'కూర్చోవయ్యా! పరవాలేదు కూర్చో!' అన్న పిదప తన చెవులు మోసం చేయడంలేదని గ్రహించి ఖరీదయిన కుర్చీలో తేలిగ్గా కూర్చున్నాడు.

ఆయన మురళికేసి చూస్తూ 'నీ పేరు మురళి కదూ!'

'అవునండి' వినయంగా అన్నాడు.

'ఇక్కడ వేకెన్సీలెన్నో తెలుసుగా!'

'62 అని పేపర్లో చూసానండి!'

'కరక్టే! కాని అప్లికేషన్‌లు మాత్రం కొన్ని వేలల్లో వచ్చాయి. పరిస్థితి నీకు అర్థమయ్యే వుంటుంది.'

ఆయనగారు ఆలోచనా నిమగ్నులై ఓ నిముషంపాటు మౌనంగా కళ్ళు మూసుకున్నారు.

మురళి ఆయన వంక చూస్తూన్నాడు.

ఉదయం కారు దిగి వచ్చేటప్పుడు వున్న ఠీవి, దర్పం

ఏమైపోయాయి? ఇంతమంది నిరుద్యోగుల కష్టాలు విని ఆయనలో దర్పం స్థానే జాలి చోటుచేసుకొందేమో!

ఆయన అకస్మాత్తుగా 'రియల్లీ ఐ పిటీ యూ మురళీ! ఈ పరిస్థితులలో నేను ఇంతకంటే సహాయం చేయలేను!'

మురళి ఉలిక్కిపడి వాస్తవంలోకి వచ్చాడు. అతని ముందు ఐదు రూపాయల నోట్లకట్ట వుంది. మురళికి ఇదంతా అయోమయంగా వుంది.

'చూడు మురళీ! నీకు ఉద్యోగం ఇవ్వలేకపోయినా ఆర్థికంగా సహాయం చేయాలనిపించింది. ఎందుకంటే చిన్నప్పుడు సత్యనారాయణ అని నాకో ఫ్రెండ్ వుండేవాడు. అతను అఖండమయిన తెలివితేటలు కలవాడు. నాకు చదువులో నిజమయిన గురువు కూడా అతనే! కానీ ఆర్థిక పరిస్థితి కారణంగా మధ్యలోనే చదువు ఆపేసి ఏదో చిన్న వ్యాపారం చేస్తున్నాడనుకొంటాను. అయినా అతను నిండు కుండలా ఎన్నడూ తొణకడు. ఒకసారి నేను డబ్బు సాయంచేయబోతే నిరాకరించాడు. నిన్ను చూడగానే అతను గుర్తుకు వచ్చాడు. ఈ డబ్బుతో ఏదయినా చిన్న వ్యాపారం చేసుకొని కొంతవరకయినా నీ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకో' అన్నారాయన.

మురళి ఆ నోట్లకట్టను టేబుల్‌మీదే వుంచి లేచి నిలబడ్డాడు. మీ దయాగుణానికి జోహారులు సార్! కాని మీకు కావలసిన అభ్యర్థిని ఎంచుకోవటంలో కూడా మీ నిస్సహాయతకు మాత్రం విచారిస్తున్నాను. సాటి మనిషిమీద సానుభూతిని రూపాయిలలో చూపించగల అంతస్థు మీకుండవచ్చు. కాని డబ్బుకోసం ఆత్మాభిమానం అమ్ముకొనే అంతస్థు మాత్రం మాకులేదు. నీతికీ, స్నేహానికీ మారుపేరయిన ఆ సత్యనారాయణగారే మా నాన్నగారు అని చెప్పుకోడానికి మాత్రం నేను గర్విస్తున్నాను. వస్తా సార్! బై' స్ప్రింగుడోర్ తెరుచుకోవడం వెంటనే యథాస్థానంలోకి రావడం జరిగింది. ఆయనగారు మాత్రం షాక్‌నుండి ఇంకా తేరుకోలేదు.




శ్రీ లక్ష్మీ వారి

వెట్ గ్రైండర్స్

గత

24 సంవత్సరాల నుంచీ

ప్రసిద్ధి చెందినది.